# శిక్షాస్మృతి

## టి. చంద్రశేఖర్ రెడ్డి

ఫలం—నరకం.

ఓ పెద్ద బల్లముందు—లావాటి బౌండు పుస్తకాలు పడేసుకుని చిత్రగుప్తుడు ఏకదీక్షగా వాటిల్లోకే చూస్తున్నాడు.

మీసాలో సారి సవరించుకుని యమధర్మరాజు రివాల్వింగ్ చెయిర్ లో ఆసీనుడయాడు. ఆయన నెత్తిమీద వున్న గడియారం గంటలు కొట్టటం మొదలెట్టింది.

వొకటి—రెండు...పది.

అవటానికి రాజయినా ఆఫీసుకు రావటంలో యమధర్మరాజు యమపంక్చుయల్. ఆయన కదలికల కనుగుణంగా క్వార్ట్జ్ వాచీలే తమ నడకని సరిచేసుకుంటాయి.

ఇక కార్యకలాపాలు మొదలించమని యమధర్మరాజు చిత్రగుప్తుడికి సైగ చేశాడు. సైగ అందుకున్న చిత్రగుప్తుడు, తన వేపే చూస్తున్న ఇద్దరు యమభటుల వేపు మరో రకంగా సైగ చేశాడు.

అవటానికి భటులైనా రాజుకన్నా భయంకరంగా ఉన్న ఆ యమ భటులిద్దరూ క్షణాల్లో ఓ మనిషిని చులాగ్గా లాక్కొచ్చారు.

లాక్కొని రాబడిన అతను సన్నగా, ఎదురుగా నిలబడి ఎవరన్నా గట్టిగా నిట్టూరుస్తే పడిపోయేలా ఉన్నాడు. వేసుకున్న ఖద్దరు లాల్చీ, పైజామా గడకర్రకు చుట్టినట్లు అతడి వొంటికి అతుక్కుని వున్నాయి. ముందుకు చాచిన అతని చెయ్యి మాత్రం వెనక్కిపోవటంలేదు.

''ప్రభూ ఇతడో చిరుద్యోగి. తనతో పని ఉండి వచ్చిన వాళ్ళ ధన రక్తాన్ని జలగలా పీల్చుకోవడం ఇతడి నైజం. బరువు పెడితే కదలగూడని కాగితాలు ఇతడి సీట్లో బరువు పెడితేకాని కదిలేవి కావు.

విన్నవించాడు చిత్రగుప్తుడు.

''అటులనా. అయిన అతని వామహస్తమును తెగనరుకుడు'' ఆజ్ఞాపించాడు యమధర్మరాజు.

యమభటులు అతన్ని తీసుకెళ్ళి మరొకతన్ని లాక్కొచ్చారు.

ఇందాక వొచ్చినతనికి పూర్తి వ్యతిరేకంగా వుంది ఇపుడొచ్చినతని గెటప్. మనిషి గాలికొట్టిన రోలర్‌లా వున్నాడు. సూటూ, బూటూ, గొంతుకు బిగుసుకున్నట్టున్న టైనాటూ. గాలి ఆడనట్టు వున్నట్టుండి అరుస్తున్నాడు.

''ప్రభూ. ఇతడు మరణించక పూర్వం ఓ ప్రభుత్వ కార్యాలయంలో వున్నతోద్యోగి. చావక ముందే ఇంట్లో నరకం చూపెట్టే గయ్యాళి భార్య బాధకి ఆగలేక ఆఫీసు స్టాఫ్‌ని చంపుకు తినేవాడు. పనున్నా లేకపోయినా తన క్రింద వుద్యోగస్తులని వర్కింగ్ అవర్స్ తరువాత కూడా ఆఫీసులోనే వుండమనటం— వాళ్ళకి పైసా వోవర్‌టైమ్ ఎలవన్స్ కూడా ఇవ్వకుండా వాళ్ళని తోమటం—''

సరియ సరియ ఇతడి చర్మంబు వొలిచి— లవణకారంబుల నద్దుడు.''

ఆర్డరు జారీ చేశాడు యమధర్మరాజు.

యమభటులు ఇంకొకతన్ని పట్టుకొచ్చారు. అతన్ని తెచ్చేందుకు యిద్దరు యమభటులు సరిపోలేదు. నలుగురు కావాల్సి వొచ్చింది.

ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచె, ఖద్దరు టోపీ— వచ్చినతను సారా పీపాలా వున్నాడు. పొట్ట భూగోళాన్ని మింగినట్టు ఎత్తుగా వుంది. ముఖం మీద చిరునవ్వు చెరగటం లేదు. జోడించిన చేతులు క్రిందకి దిగటంలేదు.

''ప్రభూ ఇతడో రాజకీయ నాయకుడు. ప్రజాసేవ పేరుతో ఇతడు చెయ్యని పాపం లేదు. పాల్పడని నీచత్వం లేదు. అమాయకులయిన ప్రజలకి అబద్ధాలు చెప్పి వాళ్ళని దోచుకోవటం— నమ్మిన వాళ్ళ నెత్తిమీద చేతులు పెట్టటం— సమయానుకూలంగా పార్టీలు మారటం. ఇంతెందుకు? బ్రతికనన్నాళ్ళూ పచ్చటి దేశానికి ఇతడు చీడపురుగుగానే బ్రతికాడు.''




చిత్రగుప్తుడు ఇంకేదో చెప్పబోయాడు.

''ఇతడిని మహోష్ణ తైలంలో జలకాలాడించండి.'' యమధర్మరాజు ఆజ్ఞాపించాడు.

ఆ తరువాత వొచ్చిన వాళ్ళు— తన అఘాయిత్యాల్తో గజగజలాడించిన గజదొంగా, దారికి అడ్డువచ్చిన ప్రతివాడ్నీ కసకసా నరికేసిన కసాయి హంతకుడూ, అందంగా కనపడ్డ అమ్మాయినల్లా చెరిచేసిన కామాంధుడూ— ఎవరికి తగ్గ శిక్ష వాళ్ళకు విధించబడింది.

చివరిగా వొచ్చిన వ్యక్తిని చూసి యమధర్మరాజు నిప్పులు కక్కాడు. కోపంతో అతడి ముక్కుపుటాలదిరిరాయి. కళ్ళు ఎర్రబడ్డాయి.

చిత్రగుప్తుడూ, యమభటులూ భయంతో గజగజ వణికిపోయారు— ఏం కొంపలు మునిగాయోనని!

యమధర్మరాజుకు అంత కోపం రావడం వాళ్ళకు తెలిసినంతవరకూ అదే మొదటిసారి.

చిత్రగుప్తుడు వొచ్చినతని గురించి ఏదో చెప్పబోయాడు.

''ఇతణ్ణి గురించి మీరేం చెప్పవలసిన అవసరం లేదు'' యమధర్మరాజు చిత్రగుప్తుణ్ని వారించాడు— ''ఇతణ్ని గురించి నాకు పూర్తిగా తెలుసు— చిత్రగుప్తా!— ఇతడు చేసిన పాపాలకు నరకంలో వున్న శిక్షలన్నీ విధించినా సరిపోదు. అయినా వున్నవన్నీ ఇతడిమీద అమలు జరపండి' ఆజ్ఞాపించాడు.

ఆ ఘోరపాపాత్ముడు వినోదం పేరుతో జనాల్ని ''చిత్ర'హింస పెట్టిన, కళను స్వలాభం కోసం వ్యాపారస్థాయికి దిగదార్చిన తెలుగు సినిమా నిర్మాత. •